క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజతో పనులను ప్రారంభిస్తున్న అధికారులు

సి.బెళగల్: కొండాపురం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహ పరిసరాల్లో ప్రహరీ నిర్మాణానికి ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ గోపాలరావు, గ్రామ పెద్దలు రూబేన్, ఆనందం, నాగరాజు, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టి



సి.బెళగల్: బ్రాహ్మణదొడ్డి స్కూల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

గూడూరు: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఉదయ్ సంతోష్ శనివారం పరిశీలించారు. పడమర, తూర్పు బీసీ కాలనీలో 4 కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట డీటీ శారద, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ హనుమంతు, వీఆర్వోలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనుపమ తనిఖీ చేశారు. బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాతోలి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు, సౌకర్యాలు, సమస్యలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పథకాల అమలుపై ఆరా తీశారు. ఆయా పాఠశాలల్లో సమస్యలను హెచ్‌ఎంలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

పకడ్బందీగా కులగణన సర్వే



ముడుమాలలో సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండల పరిధిలో కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శకుంతల సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆదేశించారు. శనివారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని ఇనగండ్ల, కొండాపురం, ముడుమాల గ్రామాల్లో పర్యటించారు. సర్వే వివరాలను రీవెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెల్లో జరుగుతున్న కులగణనను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పులు లేకుండా పకడ్బందీగా చేయాలన్నారు. అనంతరం కొండాపురం సచివాలయంలో ఉద్యోగులతో సమీక్షించారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారికి సకాలంలో అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఇంటర్ ఒకేషనల్ పబ్లిక్ ప్రాక్టికల్స్

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ, జూనియర్ కళాశాలలో శనివారం ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ దిల్షాద్ పేర్కొన్నారు. కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

కల్లూరు: వినూత్న ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యపడుతుందని.. ఆ దిశగా విద్యార్థులు ఆలోచన చేయాలని సీబీఐ మాజీ జేడీ, జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో లెవ్ యుగ్ లోగో, వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ, డీఎస్పీ మహబూబ్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల ఆలోచనలతోనే పేటీఎం, ఫ్లిప్‌కార్టు, డ్రిప్ ఇరిగేషన్ వంటి సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రతి విద్యార్థి వారి ఆశయాలు సాధించేలా కష్టపడాలన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి, లెవ్ యుగ్ లోగో సీఈఓ కైలాస్ పాల్గొన్నారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ ఖాదర్‌బాషా, షేక్ హబీబ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకుల బృందం సంగీత విభావరిలో పాల్గొంటుందని పేర్కొన్నారు.

మూగజీవాల ఆరోగ్యానికి భరోసా

- సత్ఫలితాలనిస్తున్న వైఎస్సార్ సంచార పశువైద్య సేవలు
- 1962కు ఫోన్ చేస్తే రైతుల ముంగిటకే పశువైద్యం
- అత్యాధునిక సౌకర్యాలతో అంబులెన్స్‌లు
- ఇప్పటి వరకు వెయ్యికిపైగా మూగజీవాలకు చికిత్స

గతంలో పశువులకు అనారోగ్యం, కృత్రిమ గర్భధారణ సహా పలు సేవల కోసం వ్యయ ప్రయాసల కోర్చి కిలోమీటర్ల దూరం తోలుకెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఉండేది. సరైన సమయానికి సేవలందక నష్టం జరిగేది. ప్రాథమిక చికిత్సకు సైతం పశుఆరోగ్య కేంద్రాలకు వెళ్లక తప్పేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్యలకు ముగింపు పలికింది. వైఎస్సార్ సంచార పశువైద్య సేవలను ప్రారంభించింది. 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు రైతుల ముంగిటకే పశు అంబులెన్స్‌లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాయి. మెరుగైన వైద్యం అవసరమైతే అదే వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం తిరిగి సొంత ప్రాంతానికి ఉచితంగా చేరుస్తాయి.



పాణ్యంలో పశువుకు వాహనంలో వైద్యం చేస్తున్న డాక్టర్,



పాణ్యంలో సంచార పశువైద్య సేవలపై అవగాహన,



మంచాలకట్టలో విద్యుత్ షాక్‌కు గురైన ఎద్దుకు వైద్య సేవలు

గడివేముల: పశుసంతతి యాజమాన్యంలో వైద్య సేవల పాత్ర ఎంతో కీలకమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2022 మే 19న వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రెండు విడతల్లో జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున సంచార అంబులెన్స్‌లు కేటాయించారు. ప్రస్తుతం నియోజవర్గవ్యాప్తంగా విస్తృత సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాయి. దీంతో సమస్య ఎక్కడ ఉన్నా ఫోన్ కొట్టగానే నిర్దేశించిన సమయంలో వాహనం అక్కడికి చేరుకుంటోంది.

సత్ఫలితాలనిస్తున్న సేవలు

సాధారణ సేవలతో పాటు, కృత్రిమ గర్భధారణ, శస్త్ర చికిత్స, గర్భకోశ వ్యాధి వంటి చికిత్సలను ఈ వాహనాల ద్వారా అందిస్తున్నారు. వీటితో పాటు సీజనల్ వ్యాధులు, ఇతర రుగ్మతలకు సంబంధించి టీకాలు విధిగా వేస్తున్నారు. అవసరమైన వాటికి మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, తండాలకు సైతం చేరుకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు.

అంబులెన్స్‌లో సౌకర్యాలు:

- ఒక పశువైద్యుడు, వెటర్నరీ డిప్లొమా చేసిన సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు.
- 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్తపరీక్షలు చేసేందుకు మైక్రోస్కోప్‌తో కూడిన చిన్న ప్రయోగశాల
- అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులతో పాటు పశువును వాహనంలోకి ఎక్కించేందుకు హైడ్రాలిక్ సౌకర్యం
- ప్రాథమిక వైద్యసేవలతో పాటు సన్నజీవాలు, పెంపుడు జంతువులు, పక్షులకు శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు
- అవసరమైతే హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో పశువును వాహనంలోకి ఎక్కించి సర్జరీ చేసే సౌలభ్యం ఉంది.

గంటల వ్యవధిలోనే వైద్యం

2023 నవంబర్ 1వ తేదీ గడివేముల మంచాలకట్ట గ్రామానికి చెందిన సుద్దులనడిపి లక్ష్మయ్య పశువుల కొట్టానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. ఆవుకు, గేదేకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో చుట్టుపక్కల వారు 1962 కాల్ చేశారు. పాణ్యం నుంచి అంబులెన్స్ వచ్చి తీవ్రగాయాలపాలైన పశువులకు వైద్యం అందించారు. దీంతో కొద్దిరోజులకు కోలుకున్నాయి.

మానవ వైద్యంతో సమానంగా పశువైద్యం

వైఎస్సార్ సంచార పశువైద్య సేవలు ఓ విప్లవాత్మకమైన ముందడుగు. రోగాలు, ప్రమాదాల సమయంలో మనుషులకు ఏ రకంగా వైద్యం అందుతుందో అదేస్థాయిలో చికిత్సలు వీటి ద్వారా అందుబాటులోకి వచ్చాయి. పరిస్థితి విషమించిన సమయంలో ఎలాంటి రవాణా రుసుం తీసుకోకుండా దారి వెంట చికిత్స చేసుకుంటూ పెద్దాస్పత్రులకు చేరవేసి విలువైన పశుసంపదను కాపాడుతున్నాం.

–సయ్యద్ మోయిస్, అంబులెన్స్ వైద్యాధికారి

గేదెను కాపాడారు



మాది గడివేముల మండలం బూజనూరు గ్రామం. 6 నెలల క్రితం నాకున్న ఆరు గేదెల్లో ఒకటి అనారోగ్యంతో బాధపడుతుండేది. వ్యాధి తీవ్రం కావడంతో మరణిస్తుందనుకున్నాం. స్నేహితుల సలహా మేరకు చివరి ఆశగా 1962 నంబర్‌కు కాల్ చేశాను. గంటలోనే వచ్చి పశువును పరిశీలించి వైద్యం చేసి మందులిచ్చారు. 4 గంటలకు కొంత ఉపశమనం లభించింది. 20 రోజుల్లో పూర్తిగా కోలుకుని గండం నుంచి గట్టెక్కింది. సంచార పశు వైద్య సిబ్బందికి రుణపడి ఉంటాం.

–మాబు, మంచాలకట్ట గ్రామం

కోడుమూరు–గూడూరు రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత

గూడూరు రూరల్: కోడుమూరు నుంచి చనుగొండ్ల మీదుగా గూడూరు వరకు చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను శనివారం ఎంపీపీ సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ మార్గంలో మూడు దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సులు, ఆటోలు తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఊర్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ కృషి కారణంగా రోడ్డు పనులకు మోక్షం లభించిందని చెప్పారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయిలో పనులు జరిపి పూర్తి చేస్తామని, ప్రజలకు రవాణ కష్టాలను తీరుస్తామని పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే టీబీ నయం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న వైద్యాధికారులు

గడివేముల: క్రమం తప్పకుండా మందులు వాడుతూ జాగ్రత్తలు పాటిస్తే టీబీ నయమవుతుందని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారద బాయి అన్నారు. శనివారం టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గడివేముల మండలం ఒండుట్ల గ్రామ పంచాయతీలో పర్యటించారు. స్థానిక వైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. టీబీ రోగులకు ప్రభుత్వ అందిస్తున్న వైద్యం సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో రెండు వారాల కంటే దగ్గు, జలుబు ఉన్న వారిని పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలని తలముడిపి పీహెచ్‌సీ డాక్టర్ చిన్నమద్దిలేటికి సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌పీఎం డాక్టర్ సుహాసిని, ఎంఎల్‌హెచ్‌పీ పవన్ ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థతో అవినీతి నిర్మూలన



వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు,



కోడుమూరు రూరల్: వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఓర్వకల్లు: వలంటీర్ వ్యవస్థతో అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని ఎంపీపీ తిప్పన్న అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు–1,2,3 సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండాలన్నారు. సంక్షేమ పథకాల అమల్లో వలంటీర్ల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజలకు వారు చేసిన సేవలకు గాను ప్రభుత్వం సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో పాటు నగదు పురస్కారాలను అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వలంటీర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యులు కుసుమ లత, ఫాతిమాబి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో వలంటీర్ల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్లు తమ సేవలతో ప్రజల మన్ననలు పొందారన్నారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ సేవా వజ్ర పొందిన ప్యాలకుర్తికి చెందిన హమీద్, వర్కూరుకు చెందిన లలిత, ఉత్తమ సేవా రత్న పొందిన కల్లపరి మధు, కోడుమూరు చిన్నప్ప, పులకుర్తి విజయ్‌కుమార్, ప్యాలకుర్తి గిరిజ, వర్కూరు మాసుంవలిలను ఎంపీడీఓ దివ్యతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, వర్కూరు ఎంపీటీసీ సభ్యుడు కొలన్న, సర్పంచ్ భాగ్యరత్న, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మురళీధర్, మహమ్మద్, మద్దిలేటి, సుధాకర్, రాజ్యలక్ష్మి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ టీకాలు వేయించాలి



చిన్నారికి సిరప్ అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జొహరాపురం పరిధిలోని ఏపీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ సచివాలయం, యూపీహెచ్‌సీ ముజఫర్‌నగర్ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ఉపయోగాలను తల్లులకు తెలిపారు. బర్త్‌ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ప్రసవం కోసం ఈడీడీ డేట్(డెలివరి)కి 45 రోజుల ముందు ఏ ఆసుపత్రికి వెళ్లాలనేది ఆ గర్భవతి కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి హాస్పిటల్ గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తీవ్ర రక్తహీనత కలిగిన గర్భిణులను ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డీపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సిద్ధం సభను విజయవంతం చేద్దాం

గూడూరు: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరగనున్న సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, పీఎస్ అస్లామ్ కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.. వైస్ చైర్మన్–2 బోయ లక్ష్మన్న, మునుగాల సర్పంచ్ రామాంజనేయులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూలీలకు అదనంగా 50 రోజుల పని



కోడుమూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: కరువు మండలాల్లో ఉపాధి కూలీలకు ప్రభుత్వం అదనంగా 50 రోజుల పని దినాలను కల్పిస్తోందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా అన్నారు. కోడుమూరులో జరుగుతున్న ఉపాధిపనులను శనివారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలంతా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.270 పడుతుందన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే పనులు కల్పిస్తామన్నారు. మండలంలో రోజుకు 1,400 మంది కూలీలు ఉపాధి పనుల్లోకి వస్తున్నారని, సోమవారంలోగా 2400కు పెంచాలని ఆదేశించారు. మండలానికి 60 పశువులు, గొర్రెల షెడ్ల యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కులు సాధ్యం

- ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నేత గోరంట్లప్ప



సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్లప్ప

ఓర్వకల్లు: పాత్రికేయులు ఐక్యమత్యంతో ఉంటేనే హక్కులు సాధించుకోగలమని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్లప్ప అన్నారు. శనివారం ఓర్వకల్లు సీఎల్‌ఆర్‌సీ కార్యలయంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల, నియోజకవర్గస్థాయి నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గస్థాయి కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాజేంద్రుడు, అధ్యక్షుడిగా వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా మధు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రాజేష్, రఫీక్‌బాషా, సహాయ కార్యదర్శులుగా మౌలాలి, పరమేష్, కమిటీ సభ్యులుగా మధు, నాగరాజు తదితరులు ఎంపికయ్యారు. అలాగే మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా గోపాల్, అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శిగా మౌలాలి, ఉపాధ్యక్షుడిగా భాస్కర్, సహాయ కార్యదర్శులుగా విరుపాక్షి, రాజేష్, కోశాధికారిగా వీరాంజనేయులు, కమిటీ సభ్యులుగా బోయరామకృష్ణ, శ్రీనివాసులు, రామకృష్ణ, నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కర్నూలు, నంద్యాల జిల్లా కన్వీనర్లు నాగేంద్ర, మద్దయ్య, నాయకులు వీరాంజనేయులు, శివకుమార్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక బడ్జెట్ రూ.285.74 కోట్లు

- ఆమోదించిన పాలకవర్గం
- సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి, సమస్యలపై చర్చ
- టీడీపీ కార్పొరేటర్ల తీరుపై మేయర్ ఆగ్రహం
- ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



నగర పాలక ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు,కౌన్సిలర్లు, (ఇన్‌సెట్‌లో) మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఏడాది బడ్జెట్ రూ.285.74 కోట్లు ఖరారు చేస్తూ పాలక వర్గం ఆమోదం తెలిపింది. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక సంస్థ ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు. ఏడాదిలో నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయాలు, వ్యయాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. అదే సమయంలో టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పోడియం వద్దకెళ్లి దోమల సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తూ మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. మీడియా అటెన్షన్ కోసం నాటకాలు ఆడొద్దని, మేము చిత్తశుద్ధితో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చెప్పారు. హంద్రీ, తుంగభద్ర నదుల్లో 20 ట్రాక్టర్లతో గుర్రపు డెక్క తొలగిస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలు, ఫాగింగ్ చేపడుతున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

పలు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం

నగరపాలక సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో నగర పాలక పారిశుద్ధ్యం మెరుగుకు అదనంగా నియమించిన 671 కంటింజెంటి వర్కర్లకు రూ.54 లక్షలు వేతనాలు చెల్లించేందుకు అంగీకరించారు.

- తాగునీరు దుర్వినియోగం కాకుండా నియంత్రించేందుకు ఈఎల్‌ఎస్‌ఆర్‌ల వద్ద ఎల్రక్టో మాగ్నటిక్ ఫ్లో మీటర్లు ఏర్పాటుకు రూ.99 లక్షలు కేటాయించారు.
- ఎండాకాలంలో నగర పరిధిలోని ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా రూ.1.80 కోట్లు వెచ్చించి నగరంలో బోరు వెల్స్ ఏర్పాటు, రిపేరు, రవాణా ద్వారా తాగునీటి సరఫరా తదితర పనులకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు.
- కొండారెడ్డి బురుజు వద్ద సౌండ్ అండ్ లేజర్ లైట్‌షోను శాశ్వతంగా అందించేందుకు అవసరమైన రూ.1.99 కోట్లు ఖర్చుకు ఆమోదం వ్యక్తం చేశారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించండి

కోడుమూరు అర్బన్ పరిధిలోని సంతోష్‌నగర్, గీతాముఖర్జీ నగర్, మమతానగర్, సమతానగర్, స్టాంటన్ పురం, కాలనీల ప్రజలు ప్రతి ఏడాది మురుగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. టన్నెల్ ఏర్పాటు ద్వారా సమస్య పరిష్కారమవుతందని, ఆదిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు.

ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలి

నగర పరిధిలో ఇటీవల పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయి. అక్రమార్కులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోండి. ఇందుకు నా వంతు సహకారం అందిస్తా. అలాగే పాణ్యం అర్బన్ పరిధిలో వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. అలాగే చికెన్ వేస్టేజీ సేకరణతో నష్టపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు, వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలి. నగరంలో దోమల నివారణకు చర్యలను ముమ్మరం చేయాలి.

– పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.250 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.